క్లుప్తంగా

ఎంఈవో-2గా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



నాగేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అనంతగిరి(అరకులోయటౌన్): అనంతగిరి మండల విద్యాశాఖాధికారి-2గా బి.బి.నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్నేళ్లుగా మండలంలో ఎంఈఓ-2 పోస్టును ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో ఎంఈవో బాలాజీ ఒక్కరే బాధ్యతలు స్వీకరించే వారు. డుంబ్రిగుడ మండలంలో ఎంఈఓ-2గా పనిచేస్తున్న నాగేశ్వరరావుకు అనంతగిరి మండలానికి ప్రభుత్వం బదిలీ చేయడంతో మండలంలో విద్య శాఖలో పర్యవేక్షణ సులభతమవుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈవో బాలాజీతో కలిసి విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎంఈవో-2గా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరరావుకు మండలంలోని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పి.మత్స్యలింగం, పి.సామర, ఎం.సుబ్బారావు, వి.భాస్కర్‌రావు, ఎం.రఘు, ఎంఆర్‌పీలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

దారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని ర్యాలీ



దుప్పులువాడలో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు

సీలేరు: మండల కేంద్రానికి అత్యంత మారుమూల ప్రాంతంలో ఉన్న దారకొండను మండల కేంద్రంగా ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం దుప్పులవాడలో ర్యాలీ నిర్వహించారు. దశాబ్దాల కాలంగా ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో ఉన్న సీలేరు. దుప్పులు వాడ.దారకొండ. గుమ్మిరేవులు వంటి పంచాయతీలోని గ్రామాలు నేటికీ అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. ఈ కారణం వల్ల మండల కేంద్రం జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడంతో అభివృద్ధి చెందడం లేదన్నారు. అన్ని ప్రాంతాలకు సమీపంలో ఉన్న దారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు విష్ణుమూర్తి, గోవిందు, రాజు, కృష్ణ, జగన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యులు

కొయ్యూరు: మండలంలోని రావణాపల్లి, వై.ఎన్.పాకల బాలికల ఆశ్రమ పాఠశాలల్లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. రాజేంద్రపాలెం వైద్యుడు హేమంత్ చౌదరి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు రావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనారోగ్యమైతే తక్షణమై వైద్యసేవలు పొందాలన్నారు. 40 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హెచ్‌వీ లక్ష్మి, హెచ్ఎస్ మహేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అనుమతులు



పరమసింగవరం గ్రామంలో సర్వే చేస్తున్న సిబ్బంది

సీలేరు: గూడెంకొత్త వీధి మండలం ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ఆదివాసీ గ్రామాలకు జన్‌మన్ పథకం ద్వారా రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చినట్టు పంచాయతీరాజ్ జేఈ కిముడు జ్యోతి చెప్పారు. ఇందులో భాగంగా దారకొండ నుంచి నిమ్మచెట్టు వరకు 2.4 కిలోమీటర్లు, నేలజర్త నుంచి కొండజత వరకు నాలుగు కిలోమీటర్లు, గుమ్మిరేవులు పంచాయతీ పోతవరం నుంచి ఫార్మసింగవరం వరకు ఐదు కిలోమీటర్లు, జి.నేరెడుపల్లి నుంచి కాత్రిగడ్డ ఒడిశా సరిహద్దు వరకు నాలుగు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి సర్వే చేసినట్టు తెలిపారు.నిధులు మంజూరైన తరువాత టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామన్నారు.

గ్రామాల్లో అభివృద్ధికి చర్యలు

గూడెంకొత్తవీధి: ఆది కర్మయోగి అభియాన్ గిరిజన గ్రామాల అభివృద్ధికి తోడ్పాడు అవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణ్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించి, స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఉన్నట్టు స్థానికులు తెలియజేశారు. ఎంపీటీసీ రాజేశ్వరి, మాజీ ఎంపీటీసీ రమేష్, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆశలు తీరేనా?

- పేదలకు అందని బ్యాంక్ రుణాలు
- ఇంటర్వ్యూలు నిర్వహించి నెలలు గడుస్తున్నా మంజూరు కాని సొమ్ము
- ప్రభుత్వం నుంచి బ్యాంకులకు నగదు జమచేయడంలో జాప్యం



సీలేరులోని యూనియన్ బ్యాంక్



ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు(ఫైల్)

సీలేరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలో నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక పథకాలను అమల్లోకి తీసుకొచ్చింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాల వారు సైతం చిరు వ్యాపారులు చేసుకునేందుకు రుణాలను మంజూరు చేశారు. వారి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు కల్పించి ఆర్థిక తోడ్పాటుతో ఆదుకున్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజలను పట్టించుకున్న దాఖలాలు లేవు. మధ్య తరగతి, పేదల గురించి ఎటువంటి కార్యక్రమాలు అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పైబడినా నేటి వరకు ఎవ్వరికీ రుణాలు ఇవ్వలేదు. రుణాలు ఇస్తామని ప్రకటనలు గుప్పించగా ఆశపడిన లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. రుణాలు మంజూరవుతాయని ఆశపడ్డ లబ్ధిదారులకు నెలల గడుస్తున్నా అడియాశలే మిగిలాయి. ఇప్పటికీ ఏ ఒక్కరికి రుణాలు మంజూరు కాలేదు. వాటి కోసం బ్యాంకుల చుట్టూ కాళ్లు అరిగేలా లబ్ధిదారులు తిరుగుతున్నారు. అయినా ప్రభుత్వం.అధికారులు కనికరించడంలేదు. దీంతో చిరు వ్యాపారస్తులు పొట్ట కూటి కోసం రుణాలు అందక వడ్డీ వ్యాపారస్తులు వద్ద అధిక వడ్డీలకు తీసుకొని జీవన పోషణ సాగిస్తున్నారు. అధిక వడ్డీలు చెల్లించలేక..కుటుంబ పోషణ కష్టతరంగా మారి ప్రాణాలు వదులుతున్నారు. ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం సామాన్యులపై కనీసం కనికరించడం లేదని, నిరుపేదలను ఆదుకునేందుకు కనీసం పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

లబ్ధిదారుల ఎదురుచూపులు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో 22 మండలాలు నాలుగు నెలలు కిందట ఆన్‌లైన్ రుణాల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. పాడేరు నియోజవర్గంలో గూడెం కొత్తవీధి మండలం-25. చింతపల్లి-20.పాడేరు-25. కొయ్యూరు-34.జి మాడుగుల మండల నుంచి 23 మంది ఎంపిక య్యారు. అర్హులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2024-25 ఏడాదికి మొత్తం జిల్లాలో 404 లబ్ధిదారులను ఎంపిక చేశారు. 50% ప్రభుత్వం, మరో 50% బ్యాంకులు రుణాలు ఇచ్చేలా ప్రణాళిక చేశారు. ఇందుకు గాను జిల్లా వ్యాప్తంగా రూ.7.68కోట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇప్పటివరకు ఏ ఒక్క లబ్ధిదారుడికి రుణాలు చేరలేదు. దీంతో లబ్ధిదారులు బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నారు.

ప్రకటనలకే పరిమితం

జిల్లాలో ఎస్టి లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా అందులో 70 మందిని అర్హులుగా గుర్తించి యూనిట్లు ఇచ్చేందుకు అంగీకరించారు. ఇందులో 32 రకాల వివిధ స్వయం ఉపాధి పథకం అమలు చేసే విధంగా జారీ చేశారు. ఇందుకు రూ 2.83 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం నుంచి రూ 1.13 కోట్లు సబ్సిడీ. బ్యాంకు ద్వారా రూ 1.55 ఇచ్చేందుకు అలాగే లబ్ధిదారులు వాటా రూ .0.14 కోట్లు ప్రభుత్వం నిర్దేశించింది. జిల్లాలో పాడేరు. అరకు.రంపచోడవరం నియోజవర్గాల వారీగా యూనిట్లు ఇచ్చేందుకు ఖర్చులు కూడా ప్రకటించింది. నేటి వరకు అమలుచేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వం ప్రకటనలతోనే సరిపెట్టిందని పలువురు చెబుతున్నారు.

జిల్లాలో మైనార్టీ లబ్ధిదారులు ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. 2025-26 లెక్కల ప్రకారం నాలుగు కేటగిరీలు ద్వారా 32 మంది మైనార్టీలను గుర్తించారు. వీరికి రూ. 52.50 లక్షలుఖర్చు అవుతుంది. కేటగిరి-1 లో లక్ష రూపాయల రుణం ఇచ్చి చిరు వ్యాపారాలకు ప్రోత్సహించున్నారు. కేటగిరి-2 లో లక్ష నుంచి మూడు లక్షల రూపాయల రుణం ఇచ్చి ఆటోమొబైల్ తదితర వ్యాపారాలకు ప్రోత్సహిస్తున్నారు. కేటగిరి -3 లో రూ.3లక్షల నుంచి రూ.5లక్షల లోపు లోన్ ఇచ్చి వాహనాల కొనుగోలుకు ప్రోత్సహించి ఉన్నారు. అయితే మైనార్టీ రుణాలకు ఇంకా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే విధంగా వెసులుబాటు ఉంది. ఇంకా ఇంటర్వ్యూలు పూర్తికాలేదు.

రుణాలిచ్చేది ఎప్పుడు

పేద లబ్ధిదారులు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ రుణాలు కోసం నెలలుగా ఎదురుచూస్తున్నారు. బ్యాంకులు చుట్టూ తిరుగుతూ ఎప్పుడు ఇస్తారని అడుగుతున్నారు అయితే ప్రభుత్వం సబ్సిడీ లోన్లు ప్రకటించింది కానీ ఇప్పటివరకు సంబంధిత బ్యాంకులకు డబ్బును జమ చేయకపోవడం వల్లే ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రభుత్వం ఎస్సీ.బీసీ.మైనార్టీ. క్రిస్టియన్ సంబంధించి రుణాలకు ఇస్తామని ప్రకటన చేసి ఇంటర్వ్యూలు లబ్ధిదారుల ఆశలపై లబ్ధిదారుల ఆశలపై నీళ్లు జల్లారు. కానీ ఎస్టీ కులానికి సంబంధించి రుణాలు ఇప్పటివరకు ప్రకటించలేదు.అన్ని కులాల వారికి ప్రకటించి ఈ కులానికి ఇవ్వలేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాని పలువురు ఆరోపిస్తున్నారు.

పేదలను ఆదుకోవాలి



మాది నిరుపేద కుటుంబం. సీలేరులో ఉంటున్నాం. తల్లి తండ్రి లేరు నేను నా భార్య మా కష్టం పైనే బతుకుతున్నాం. ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ బీసీ లోన్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటి వరకు లోన్ మంజూరు కాలేదు. కిరాణా షాప్ నిర్వహించాలని యోచిస్తున్నాను. ప్రభుత్వం స్పందించి మాలాంటి పేదలకు త్వరితగతిన రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలి.

– ఆనంద్, లబ్ధిదారుడు, సీలేరు

నాలుగు నెలలుగా ఎదురుచూపులు



బీసీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే లోన్ కోసం నాలుగు నెలలుగా ఎదురు చూస్తున్నాం. బ్యాంకులకు వెళ్లి అడిగిన ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. ప్రభుత్వం తక్షణమే లోన్ ఇచ్చి ఆదుకోవాలి. మాలాంటి పేదవారికి ఆర్థిక సాయమందించాలి.

-చెంచులక్ష్మి, గృహిణి, సీలేరు

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

చింతపల్లి: మండల కేంద్రంలోని జూనియర్, డిగ్రీ కళాశాలలో మహిళల చట్టాలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై సఖి వన్‌స్టాఫ్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సఖి వన్‌స్టాప్ సభ్యురాలు సంధ్యారాణి మాట్లాడుతూ విద్యార్థులు స్వీయరక్షణపై అవగాహన కలిగి ఉండాలని, హింసాత్మక ఘటనలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. సుబ్బారావు, పుణ్యలక్ష్మి, సంధ్య, స్వర్ణభారతి తదితరలు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో ప్యాకేజీ పొందిన వారిపై చర్యలకు డిమాండ్



ఐటీడీఏ ఏపీవో రమణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కుంజా శ్రీను

రంపచోడవరం: నకిలీ ధ్రువప్రతాలతో పోలవరం ప్యాకేజీ పొందిన గిరిజనేతరులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, పోలవరం ప్రాజెక్టు ముంపులో కొత్తగా గిరిజనేతరులకు ప్యాకేజీ ఇవ్వవద్దని రంపచోడవరం ఏపీవోకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను గురువారం వినతిపత్రాన్ని అందజేశారు.దేవీపట్నం మండలంలో బినామీ పేర్లతో , ప్రభుత్వ భూములను కూడా కబ్జా చేసి గిరిజనేతరులు కోట్లాది రూపాయాలు ప్రభుత్వ సొమ్మును దండుకున్నారని పేర్కొన్నారు. తప్పుడు ఎన్ఓసీలు ఇవ్వడం వలన వలస వచ్చిన గిరిజనేతరులు ధ్రువీకరణ పత్రాలు పొంది ప్రభుత్వాన్ని మోసం చేశారన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



కమిటీ ఏర్పాటు అనంతరం సమావేశమైన నేతలు

గూడెంకొత్తవీధి: సర్పంచ్ కొర్రా సుభద్ర అధ్యక్షతన వైస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం గూడెం పంచాయతీలో పార్టీ కమిటీని నియమించారు. పంచాయతీ పార్టీ అధ్యక్షుడిగా కొర్రా నూకరాజు, ప్రధాన కార్యదర్శులుగా సుబ్బారావు, దేవదాస్, శాంతిరాజు, కార్యదర్శులుగా పరమేశ్వరరావు, వెంకటరావు, రాజారావు, భీమరావు, ప్రసాద్, రైతు విభాగ అధ్యక్షుడిగా రాంబాబు, ప్రధాన కార్యదర్శులుగా రాంబాబు, పెద కొండబాబు, నాగేశ్వరరావు, జగత్‌రావు, యూత్ విభాగ అధ్యక్షుడిగా శ్రీను, ప్రధాన కార్యదర్శులుగా సిమోన్, త్రినాథ్, రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా చంటి, ప్రధాన కార్యదర్శులుగా చిలకమ్మ, చిన్నమ్మి, క్రిస్టియన్ విభాగ అధ్యక్షుడిగా జాషువను ఎన్నుకున్నారు. పలువురు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తామన్నారు. నాయకులు బాబి, చంటిబాబు, చిన్నభాయి, ఉదయభాస్కర్, ఎంపీటీసీ కొర్రా సభ్యురాలు రాజులమ్మ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీలో విజేతలకు బహుమతులు



విజేత టీమ్‌కు బహుమతి అందిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, నేతలు

ముంచంగిపుట్టు: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక అల్లూరి యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నిర్వహించిన డాన్స్ పోటీలకు విశేష స్పందన లభించింది.పాడేరు, విశాఖ, పెదబయలు, చింతపల్లి తదితర ప్రాంతాలతో పాటు ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి చిన్నార్లు, యువత డాన్స్ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లోని జూనియర్ సింగిల్స్ విభాగంలో శరణ్య ప్రథమ బహుమతి, పాంగి స్మైలీ ద్వితీయ బహుమతి, నిత్య తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. జూనియర్స్ గ్రూపులో మట్టం హాసిని గ్రూప్ ప్రథమ, బటర్ ఫ్లై గ్రూప్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ సింగిల్స్‌లో పాడేరుకు చెందిన శివాజీ పుష్ప గెటప్‌తో చేసిన డాన్స్‌కు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు, మౌలి ద్వితీయ ,జై తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.సినియర్స్ గ్రూప్స్‌లో పాడేరుకు చెందిన డేవిడ్ గ్రూపు ప్రథమ బహుమతి,ఎస్‌కె గల్లీ బాయ్స్ జోలాపుట్టు ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పద్మరావు, అల్లూరి యూత్ సభ్యుల చేతుల మీదగా విజేతలకు బహుమతులు అందజేశారు. యూత్ సభ్యులు ఉదయ్, గణపతి, రవి, శ్రీను, కిరణ్, మురళి, ఆచారి, కృష్ణ, సతీష్, గణేష్, శ్యామ్, శంకర్, నరేష్ పర్యవేక్షించారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



ఎర్నాపల్లి తాగునీటి కమిటీ నూతన కార్యవర్గం

గూడెంకొత్తవీధి: శంకాడ పంచాయతీ ఎర్నాపల్లిలో గురువారం జల్ జీవన్ మిషన్ నీటి ట్యాంకు పరిరక్షణ కమిటీని 15 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. ఏ సమస్య కారణంగా ఇబ్బందులు వస్తే ఈ కమిటీ ఇంటి నుంచి ఒకో రూపాయిని వసూలు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటుందని పంచాయతీ కార్యదర్శి జ్యోతిరాణి తెలిపారు. తాగునీటి సరఫరాను ఈ కమిటీ పర్యవేక్షణ చేస్తుందన్నారు.సంకాడ సర్పంచ్ నాగులమ్మ, కూటమి నాయకులు నాగేంద్ర, చంటిబాబు, బుద్ధపడాల్, లక్ష్మణరావు, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీరుపై ధ్వజం

ఎటపాక: పత్తి దిగుమతి సుంకాల రద్దుకు నిరసనగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఎటపాకలో జరిగిన ఈ కార్యక్రమంలో సంయుక్త ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి దాసరి సాయన్న మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే ఫారెన్‌ట్రేడ్ అగ్రిమెంట్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పత్తి దిగుమతి సుంకాలు రద్దుతో రైతులు నష్టపోతున్నారన్నారు.పత్తి క్వింటాకు రూ10,075 చెల్లించాలని, బాధిత రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బంధం శ్రీదేవి

రంపచోడవరం: ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయాలతో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి ఆచరణలోకి తీసుకొచ్చిందని దాని కోసం శిక్షణ ఇస్తుందని రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి తెలిపారు. రంపచోడవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో తూతిక శ్రీనివాస్‌విశ్వనాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రజాప్రతినిధులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ పేదరికి నిర్మూలన, తాగునీరు సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలతో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి ఆచరణలోకి తీసుకురావాలన్నారు. ప్రజాప్రతినిధులు శిక్షణ పొంది అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రభుత్వ విధానాలు అమలు చేయాలన్నారు. కార్యదర్శి శ్రీరామ్ పలు అంశాలను వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుకడు కుజం వంశీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు ఎంఈవో బాబూరావుపడాల్, ఎంఈవో-2 వెంకటరమణమూర్తి

జి.మాడుగుల: మండల కేంద్రంలో గురుపూజోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా సూరిమెట్ట, గాంధీనగరం, కె.కోడాపల్లి, వై కంఠవరం, బొర్రతాడి, వాకపల్లి గ్రామాల మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు కె.దేముళ్లనాయుడు, మత్స్యరాస మత్స్యరాజు, తుర్రే రామస్వామి, సూరే చిరంజీవి, డి.వెంకటరావు, మోస్య రవి, పినలోచలి, ఎర్రగొప్ప ఎంపీపీ పాఠశాల హెచ్ఎంలు ఆర్.జగన్‌మోహన్‌రావు, కొండపల్లి అనురాధ, గాంధీనగరం, బొండాలవలస గ్రామాల్లోని ఉపాధ్యాయులు నాగమణి, చిరంజీవి తదితరులకు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందారు. వారిని ఎంఈవో చిట్టపులి బాబూరావు పడాల్, ఎంఈవో-2 వెంకటరమణమూర్తి అవార్డులు, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.అనంతరం ఉపాధ్యాయులందరు కలసి ఎంఈవోలకు శాలువలు కప్పి సన్మానించారు.

వైభవంగా వినాయక నిమజ్జనాలు



సెల్లమ్‌లో గణనాథుడిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు



వై.రామవరంలో గిరిజన సంప్రదాయ నృత్యాలతో గణనాథుని ఊరేగింపు



ఎటపాకలోని ఊరేగింపులో స్థానికుల సందడి

ముంచంగిపుట్టు: మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ సెల్లుమ్ గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు గురువారం దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు వారికి ప్రసాదం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో వినాయకుడిని శోభాయాత్రలో జెడ్పీ చైర్ పర్సన్ పాల్గొన్నారు. సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పద్మారావులు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గణేష్ నిమజ్జన ఉత్సవం ఘనంగా జరిగింది. పోతంగి పంచాయతీ వెంకటరావు పాల్గొన్నారు. ఊరేగింపులో యువత,చిన్నారులు డ్యాన్స్‌లతో సందడి చేశారు. సమీప చాపరాయి గెడ్డలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. సభ్యులు సూర్యప్రకాష్, నవసూర్యలు, ఉదయ్, సాయి, గురు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోపలు ప్రాంతాల్లో నిర్వహించిన గణనాథుని నిమజ్జనంలో భక్తులు పాల్గొన్నారు. పెద్దేరు వాగులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. సీఐ బి.నరసింహమూర్తి ఆదేశాల మేరకు ఎస్ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఎటపాక: మండలంలోని గన్నేరుకొయ్యాపాడు గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుని నిమజ్జనం జరిగింది. వసంతాల బ్రదర్స్ సహకారంతో టీషర్లు పంపిణీ చేశారు. వాటిని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఆకుల వెంకటరామారావు చేతుల మీదుగా అందజేసారు. అనంతరం గణనాథుడికి ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు తరువాత పవిత్ర గోదావరి నదిలో భక్తి శ్రద్ధలతో వినాయకుడిని నిమజ్జనం చేశారు.

గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు

కొయ్యూరు/సీలేరు/జి.మాడుగుల: నియోజకవర్గంలోని కొయ్యూరు, సీలేరు, జి.మాడుగుల ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం భారీ ఊరేగింపు జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం





అరకులోయ, రంపచోడవరంలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అరకులోయటౌన్: జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు భావితరాలకు మార్గదర్శకులన్నారు. ఉపాధ్యాయుని స్థాయి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.అరకులోయలోని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీఓలు నాగబాబు, విజయలక్ష్మీ, అనితకుమారి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులోని జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నార.

రంపచోడవరం: మండలంలోని జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వసుధ, ఎంపీటీసీ కుంజం వంశీ, వార్డు మెంబరు లక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.



తామరపల్లిలో ఉత్తమ టీచర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది, విద్యార్థులు





సీలేరు, రాజవొమ్మంగిలోని వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాజ్‌మా విత్తనాల పంపిణీ

దుంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో రైతులకు గురువారం రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు మాట్లాడుతూ రైతులకు రాయితీపై అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దుంబ్రిగుడలో ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ చటారి జానకమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి నందు చేతుల మీదుగా రాజ్‌మా విత్తనాలు అందజేశారు. వైస్ ఎంపీపీ ఆనంద్, పోతంగి సర్పంచ్ వెంకటరావు, మండల వ్యవసాయధికారి వాసుదేవరావు, మాజీ జడ్పీటీసీ శ్రీరాములు, మాజీ ఎంపీపీ దన్నేరావు, నాయకులు సింహాచలం, సుబ్బారావు, మండ్యాగురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: కర్రిముఖిపుట్టులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్బారావు, నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ గణపతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: పెదలువ్వాసింగిలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు, పీఆర్ ఏఈ సమిరెడ్డి మాణిక్యం, ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, ఉప సర్పంచ్ గణపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, బంగార్రాజు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల, మంప పంచాయతీల్లో యూరియాను పంపిణీ చేశారు. వ్యవసాయ ఉద్యాన సహాయకులు ప్రభాకర్, సీఐ బి శ్రీనివాసరావు, మంప ఎస్ఐ శంకర్‌రావు, ఉప సర్పంచ్ గాంధీ, మాజీ ఎంపీటీసీ శివరామరాజు, బూదరాళ్ల సర్పంచ్ ముత్యాలమ్మ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామంలో ఎంపీడీవో యాదిగిరీశ్వరరావు, ఏపీవో శ్రీనివాసరావు గురువారం పర్యటించారు.ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు అందించిన పలు రకాల ఉద్యాన మొక్కల సాగుపై ఆరా తీశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగునకు రైతులకు ఐటీడీఏ ప్రోత్సాహక నిధులు అందజేస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటల సాగుపై పలు సూచనలు ఇచ్చారు. ఉద్యానపంటల సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ వీరబాబు, సిబ్బంది ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జి.మాడుగుల: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అందుబాటులో యూరియా

చింతపల్లి: మండలానికి 16.8 టన్నుల యూరియా వచ్చినట్టు వ్యవసాయాధికారి టి.మధుసూదన రావు తెలిపారు.చింతపల్లి, చౌడుపల్లి రైతు సేవా కేంద్రాలకు 6 టన్నులు యూరియా రాగా మండల కేంద్రంలో 10.8 టన్నులు అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు.